
https://trinetnews.com/
# ట్రైనెట్ న్యూస్
నిజం • బాధ్యత • నిబద్ధత
తెలుగు దిన పత్రిక
తాజా తెలుగు వార్తలు
ప్రతి 3 గంటలకు
98497 67747 | 9494184136
1 PM TO 4 PM
సంపుటి: 01 | సంచిక:26 | పేజీలు :02 | వేల:2/రూ | ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు | శుక్రవారం, సెప్టెంబర్ 11,2026



కాంగ్రెస్‌పై కాశ్మీర్

# సీఎం ఫైర్

వందేమాతరం

వివాదం..

కాశ్మీరీలను జైలుకు

పంపిస్తారా..

## రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ

# కుల సర్వే నిర్వహించింది

## జనగణన ప్రశ్నావళిలో బీసీ కులగణనను చేర్చాలి

### -మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 11:

ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణలో సమగ్ర కుటుంబ కుల సర్వే నిర్వహించిందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి తదితర వివరాలను శాస్త్రీయంగా సేకరించాం అని చెప్పారు. తెలంగాణలో నిర్వహించిన సమగ్ర కుల సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. ...మిగతా 2లో...



## హౌతీలపై

# దాడులు చేయండి..

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కోరిన సౌదీ రాజు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

ఇరాన్–అమెరికా మధ్య యుద్ధం ముదురుతోంది. ఇప్పుడు ఈ యుద్ధంలోకి యెమెన్‌లోని ఉగ్రవాదులు హౌతీలు కూడా ఎంటర్ అయ్యారు. వీరు ప్రధానంగా ఎర్ర సముద్రంపై, సౌదీపై దాడులకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో యెమెన్‌లోని హౌతీలపై దాడులు చేయాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సౌదీ రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) కోరారు. ఈ మేరకు ట్రంప్‌నకు సౌదీ రాజు రెండుసార్లు ఫోన్ చేసిన కోరినట్లు తెలుస్తోంది. హౌతీలు.. యెమెన్‌లో ఉన్న ఉగ్రవాదులు. అక్కడి ప్రభుత్వంపైనే తిరుగుబాటు చేస్తుంటారు.వీరికి ఇరాన్ మద్దతు ఇస్తుంది. అంటే, వీరికి అవసరమైన ఆర్థిక వనరులు, ఆయుధాలు వంటివి ఇరాన్ సమకూరుస్తుంది. ప్రస్తుతం ఇరాన్‌పై అమెరికా దాడి చేస్తుండటంతో హౌతీలు ఇరాన్‌కు మద్దతుగా రంగంలోకి దిగారు. ...మిగతా 2లో...




ఆశా వర్కర్ల 'చలో అసెంబ్లీ' నిరసనలో

# ఉద్రిక్తత..

## ఇద్దరు ఆశా వర్కర్లకు అస్వస్థత

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చలో అసెంబ్లీ నిరసన కార్యక్రమాన్ని బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆవరణలో చేపట్టారు. నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లను పోలీసులు అరెస్ట్ చేస్తున్న సమయంలో ఇద్దరు ఆశాలు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు ఇష్టానుసారంగా దాడి చేసి మా వేళ్లు విరుస్తున్నారని ఆశా వర్కర్ల ఆవేదన వ్యక్తం చేశారు.



# పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

## ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్


దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

నెలరోజుల్లో ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశం

సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచన

క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజా సమస్యలు తెలుసుకోవాలని దిశానిర్దేశం

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11




ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించ కుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

# లారీని ఢీకొట్టిన వ్యాన్..

## మహిళలు, పిల్లలతో సహా 9 మంది మృతి




ముంబై:ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

వేగంగా ప్రయాణించిన ఒక వ్యాన్, పెట్రోల్ బంకు నుంచి బయటకు వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యాన్‌లో ఉన్నవారిలో ఆరుగురు మహిళలు, ముగ్గురు పిల్లలతో సహా 9 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. మహారాష్ట్రలోని భండారా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున నాగ్‌పూర్–రాయ్‌పూర్ జాతీయ రహదారిలో ఉన్న పింపల్‌గావ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఉన్న పెట్రోల్ బంకు నుంచి హైవేపైకి వస్తున్న ఒక లారీని అతివేగంతో వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది.

# ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

## మా జుట్టు పట్టుకుని లాగారు



అసెంబ్లీ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి

ఫిర్యాదు చేసిన బీఆర్‌ఎస్

మహిళా ఎమ్మెల్యేల జుట్టు

పట్టుకుని లాగారని ఆరోపణ

ఇది కుట్రలో భాగమేనని సబితా

ఇంద్రారెడ్డి వ్యాఖ్య

డీజీపీకి ఫిర్యాదు చేసినా చర్యలు

శూన్యమని ఆవేదన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానరకరమైన ప్రవర్తన ఎదురైందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆశ్రయించింది. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేల బృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

# ఓటర్ల జాబితా సవరణ


## : సమంత, విజయ్ దేవరకొండ, వీవీఎస్ లక్ష్మణ్ సహా ప్రముఖులకు నోటీసులు

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా పలువురు ప్రముఖులకు ఈసీ నోటీసులు

హైదరాబాద్‌లో సమంత, విజయ్ దేవరకొండ, మహేశ్ బాబు, రాజమౌళి తదితరులు

పేర్లలో తప్పులు, పాత రికార్డులతో వివరాలు సరిపోలకపోవడమే కారణం

ఇది కేవలం పరిశీలనకేనని, ఓటు హక్కు రద్దు కాదని అధికారుల స్పష్టత




ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు11

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

## జీహెచ్ఎంసీకి యాడ్ ఏజెన్సీల బకాయిల చిట్టా..

# టాప్ డిఫాల్టర్లు వీళ్లే!

జీహెచ్ఎంసీకి యాడ్ ఏజెన్సీల భారీ బకాయి
సుమారు రూ. 39.74 కోట్లు చెల్లించాల్సి ఉన్నట్టు వెల్లడి
శాసనమండలిలో ఎమ్మెల్సీ ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం
బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ ఏజెన్సీల పేర్లు
యూనియాడ్స్ నుంచే అత్యధికంగా రూ. 7.71 కోట్ల బకాయి




త్రినెట్ న్యూస్, సెప్టెంబరు11

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోని అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలు భారీగా బకాయిలు పడ్డాయి. ఈ ఏజెన్సీల నుంచి జీహెచ్ఎంసీకి సుమారు రూ. 39.74 కోట్లు (ఖచ్చితంగా రూ. 39,74,15,778) రావాల్సి ఉందని తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, పురపాలక-పట్టణాభివృద్ధి శాఖ సెప్టెంబరు 10న శాసనమండలిలో ఈ వివరాలను సమర్పించింది.ప్రభుత్వం అందించిన నివేదిక ప్రకారం.. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో మొత్తం 452 ఏజెన్సీ ఎంట్రీలు, 1,521 అడ్వర్టైజ్‌మెంట్ యూనిట్లకు సంబంధించి ఈ బకాయిలు పేరుకుపోయాయి. బకాయిదారుల జాబితాలో పలు ప్రముఖ సంస్థలు ఉన్నాయి. ముఖ్యంగా, యూనియాడ్స్ అనే సంస్థ ఒక్క యూనిట్‌కే అత్యధికంగా రూ. 7.71 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఐ క్యాచ్ కమ్యూనికేషన్స్ మరో యూనిట్‌కు సంబంధించి రూ. 6.47 కోట్లు బకాయిపడింది.అత్యధిక యూనిట్లు కలిగిన సంస్థల్లో ప్రకాశ్ ఆర్ట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థకు చెందిన 53 యూనిట్లకు గానూ మొత్తం రూ. 5.35 కోట్లు బకాయిలు ఉన్నాయి. వీటితో పాటు మీడియా కార్ప్ రూ. 5.06 కోట్లు, సీఎంఎస్ఎస్ రూ. 1.79 కోట్లు, అవుట్‌స్పేస్ అడ్వర్టైజింగ్ రూ. 1.86 కోట్ల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉంది.అవుట్‌డోర్ ప్రకటనల నియంత్రణ కోసం ప్రభుత్వం ఈ ఏడాది మార్చి, జూన్ నెలల్లో 'అవుట్‌డోర్ అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ ఫర్ క్యూర్-2026'ను జారీ చేసింది. దీని ప్రకారం.. ప్రైవేట్ ఆస్తులపై ప్రదర్శించే ప్రకటనలకు ఆన్‌లైన్ ద్వారా, ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలకు టెండర్ల ద్వారా అనుమతులు మంజూరు చేస్తారు. అయితే, ఫీజుల వసూలుకు సంబంధించి 2020 నాటి మార్గదర్శకాలు ప్రస్తుతం నిలిపివేతలో ఉన్నాయని, త్వరలోనే సమగ్రమైన కొత్త విధానాన్ని తీసుకురానున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

మొదటిపేజీ తరువాయి

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే..

### ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్

సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు.
ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు.

**నెల రోజుల్లో ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే..**

ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.

**క్షేత్రస్థాయి పర్యటనలతో సమస్యల పరిష్కారం**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు.సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.

**గ్రామ, వార్డు సిబ్బందికి జాబ్ ఛార్ట్**

స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

మొదటిపేజీ తరువాయి

## రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ కుల సర్వే నిర్వహించింది

రాష్ట్రంలో బీసీల జనాభాకు సంబంధించిన ప్రామాణికమైన గణాంకాలు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం వద్ద ఉన్నాయని వివరించారు. ఈ గణాంకాల ఆధారంగా బీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు, విద్యా- ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. అయితే రిజర్వేషన్లను 50 శాతం పరిమితికి మించి పెంచాలంటే ఖచ్చితమైన, శాస్త్రీయమైన, ప్రామాణికమైన కుల జనాభా గణాంకాలు అత్యంత అవసరం అని మంత్రి పొన్నం అన్నారు. దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం జరగాలంటే బీసీలు ఎంతమంది ఉన్నారో ఖచ్చితంగా లెక్కించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2027 జనగణనలో కుల గణన చేపడతామని ప్రకటించినప్పుడు దేశవ్యాప్తంగా బీసీ, ఓబీసీ వర్గాల్లో ఆశలు, హర్షం వ్యక్తమయ్యాయని చెప్పారు. కానీ ప్రస్తుతం రూపొందించిన జనగణన ప్రశ్నావళిలో బీసీ/ఓబీసీ జనాభాను స్పష్టంగా లెక్కించే అవకాశం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మొదట రూపొందించిన 32 ప్రశ్నల ప్రశ్నావళిలో ఎస్సీ, ఎస్టీల వివరాలకు ప్రాధాన్యత ఇచ్చినా బీసీ/ఓబీసీ వర్గాల వివరాలను పొందుపరచలేదన్నారు. అనంతరం ఆగస్టు 14న రూపొందించిన 40 ప్రశ్నల ప్రశ్నావళిలో కూడా 10వ ప్రశ్న ద్వారా ఎస్సీ /ఎస్టీ వివరాలు అడుగుతున్నప్పటికీ బీసీ/ఓబీసీ వివరాలను అడగలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీల వివరాలు సేకరిస్తున్నప్పుడు బీసీల వివరాలను కూడా ఎందుకు సేకరించకూడదు? కేంద్ర ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. దేశంలో బీసీలు ఎంతమంది ఉన్నారో ఖచ్చితమైన లెక్కలు లేకుండా బీసీల కోసం సమర్థవంతమైన సంక్షేమ, అభివృద్ధి విధానాలను ఎలా రూపొందిస్తారు? అని మంత్రి ప్రశ్నించారు. జనాభాలో తమ వాటా ఎంత ఉందో తెలియకుండా విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల్లో న్యాయమైన వాటా ఎలా కల్పిస్తారు? అని ప్రశ్నించారు. "మేమెంతో మాకంతా" అనే నినాదాన్ని నిజం చేయాలంటే ప్రతి సామాజిక వర్గానికి సంబంధించిన ఖచ్చితమైన జనాభా గణాంకాలు ఉండాలన్నారు బీసీ/ఓబీసీ కుల గణనను ఓపెన్ విధానంలో కాకుండా, శాస్త్రీయంగా, స్పష్టంగా, డ్రాప్‌డౌన్ విధానం ద్వారా నిర్వహించాలని కోరారు. ఓపెన్ విధానంలో కులాల పేర్ల నమోదులో తప్పులు, భిన్నమైన పేర్లు, స్పెల్లింగ్ మార్పులు, ఉపకులాల కారణంగా గణాంకాల్లో వ్యత్యాసాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకే తెలంగాణలో నిర్వహించిన సర్వే తరహాలో స్పష్టమైన కేటగిరీలు, శాస్త్రీయ పద్ధతులతో కుల గణన చేపట్టాలన్నారు. ఈ అంశంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాసి బీసీ/ఓబీసీల కుల గణనపై స్పష్టత కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే దేశానికి ఆదర్శంగా నిలిచే విధంగా సామాజిక న్యాయం కోసం కుల సర్వే నిర్వహించి ఫలితాలను ప్రజలకు అందించింది. ఇప్పుడు అదే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. 2027 జనగణనలో బీసీ/ఓబీసీ కుల గణనను చేర్చడం ద్వారా మాత్రమే దేశంలోని బీసీల వాస్తవ జనాభా, సామాజిక- ఆర్థిక స్థితిగతులు, వారి అవసరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని అధిగమించాలన్నా, బీసీలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం చేయాలన్నా ప్రామాణిక కుల జనాభా గణాంకాలు తప్పనిసరి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. "బీసీల జనాభా లెక్కించండి బీసీలకు న్యాయం చేయండి" అనే డిమాండ్‌తో కేంద్ర ప్రభుత్వం 2027 జనగణన ప్రశ్నావళిలో బీసీ/ఓబీసీ కుల గణనను చేర్చాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

మొదటిపేజీ తరువాయి

## ఓటర్ల జాబితా సవరణ

ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

మొదటిపేజీ తరువాయి

## హౌతీలపై దాడులు చేయండి..

ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం ముదురుతోంది. ఇప్పుడు ఈ యుద్ధంలోకి యెమెన్‌లోని ఉగ్రవాదులు హౌతీలు కూడా ఎంటర్ అయ్యారు. వీరు ప్రధానంగా ఎర్ర సముద్రంపై, సౌదీపై దాడులకు దిగుతున్నారు. ఈ నేపథ్యంలో యెమెన్‌లోని హౌతీలపై దాడులు చేయాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సౌదీ రాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) కోరారు. ఈ మేరకు ట్రంప్‌నకు సౌదీ రాజు రెండుసార్లు ఫోన్ చేసిన కోరినట్లు తెలుస్తోంది. హౌతీలు.. యెమెన్‌లో ఉన్న ఉగ్రవాదులు. అక్కడి ప్రభుత్వంపైనే తిరుగుబాటు చేస్తుంటారు.వీరికి ఇరాన్ మద్దతు ఇస్తుంది. అంటే, వీరికి అవసరమైన ఆర్థిక వనరులు, ఆయుధాలు వంటివి ఇరాన్ సమకూరుస్తుంది. ప్రస్తుతం ఇరాన్‌పై అమెరికా దాడి చేస్తుండటంతో హౌతీలు ఇరాన్‌కు మద్దతుగా రంగంలోకి దిగారు. సౌదీపై దాడులు చేస్తున్నారు. అలాగే, సౌదీ చమురు నౌకలు ప్రయాణించే ఎర్ర సముద్రంలోని చెక్ పాయింట్‌ను హౌతీలు బ్లాక్ చేశారు. దీంతో హౌతీలపై దాడి చేయాల్సిందిగా సౌదీ రాజు ఎంబీఎస్.. ట్రంప్‌ను కోరారు. దీనికి ట్రంప్ నుంచి సరైన స్పందన రాలేదని తెలుస్తోంది. ఎందుకంటే ప్రస్తుతం యెమెన్‌లో అంతర్యుద్ధం కొనసాగుతోంది.అంటే, అక్కడి ప్రభుత్వ సైన్యానికి, హౌతీ ఉగ్రవాదులకు మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాము నేరుగా హౌతీలపై దాడి చేయలేమని అమెరికా తేల్చిచెప్పింది. వారిపై ప్రత్యక్ష దాడులకు దిగబోమని, అలాంటి ప్రణాళికలు లేవని సౌదీ రాజుకు అమెరికా వివరించింది. సౌదీ రక్షణ బాధ్యత అమెరికానే చూసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే.. సౌదీలో అమెరికా ఆర్మీ బేస్‌లున్నాయి. అమెరికాకు చెందిన ఆర్మీతోపాటు వైమానిక దళానికి సౌదీ ఆశ్రయం ఇస్తుంటుంది. ఇక్కడి నుంచే అమెరికా దాడులు చేస్తుంది. ఆర్మీ బేస్‌లు ఏర్పాటు చేసుకోనిచ్చినందుకుగాను.. సౌదీని రక్షించాల్సిన బాధ్యత అమెరికాది.అందుకే, తమపై దాడికి దిగిన హౌతీలపై దాడి చేయాలని అమెరికాను సౌదీ కోరింది. సౌదీ అరేబియాకు, హౌతీలకు మధ్య కొంతకాలంగా ఘర్షణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో అమెరికా రక్షణ శాఖకు చెందిన ఉన్నతాధికారి బ్రాడ్ కూపర్.. రియాద్ వెళ్లి చర్చించినట్లు కూడా సమాచారం. అయితే, ఈ అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

మొదటిపేజీ తరువాయి

# సీఎం ఫైర్

జమ్మూ కాశ్మీర్‌లో వందేమాతరం గేయం ఆలపించే విషయంపై రాజకీయ వివాదం నడుస్తోంది. ఈ గేయాన్ని పూర్తిగా ఆలపించబోమని కాంగ్రెస్ చెబుతుంటే.. తాము మాత్రం మొత్తం గేయాన్ని ఆలపిస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్సీపీ) ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉంది. కూటమి ప్రభుత్వంగా ఉన్నప్పటికీ.. కాంగ్రెస్ వైఖరిని ఎన్సీపీని తప్పుబట్టింది. ఈ మేరకు సీఎం ఒమర్ అబ్దుల్లా కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు.తాజాగా జమ్మూ కాశ్మీర్‌లో అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ ప్రారంభ వేడుకల సందర్భంగా జాతీయ గీత జనగణమనతోపాటు జాతీయ గేయం వందేమాతరం కూడా ప్లే చేశారు. ఈ రెండూ ప్లే చేసేటప్పుడు జమ్మూ కాశ్మీర్ ఎల్జీ, సీఎం, ఇతర నేతలు నిలబడి ఉన్నారు. అయితే, పూర్తి గేయం ప్లే చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. తాము ఈ గేయాన్ని పూర్తిగా ఆలపించబోమని, రెండు చరణాలు మాత్రమే పాడుతామని కాంగ్రెస్ చెప్పింది. అయితే, సీఎం ఒమర్ అబ్దుల్లా మాత్రం కాంగ్రెస్ వైఖరిపై మండిపడ్డారు. శుక్రవారం ఈ అంశంపై మాట్లాడారు. వందేమాతరం గేయం పాడాలంటూ చట్టం చేసేటప్పుడే పార్లమెంట్‌లోనే కాంగ్రెస్ అడ్డుకోవాల్సింది.ఇప్పుడు ఇది చట్టంగా మారింది. దీని ప్రకారం మొత్తం గేయం పాడాలి. అలా పాడకుంటే అది నేరమే. ఈ చట్టం దేశమంతా వర్తిస్తుంది. ప్రభుత్వాలు దీన్ని అమలు చేయకుండా తప్పించుకోకూడదు. ఈ చట్టం ప్రకారం వందేమాతరంలోని అన్ని గేయాలు పూర్తిగా ఆలపించాల్సిందే. ఈ విషయంలో కాంగ్రెస్ అభ్యంతరం ఏంటి..? వందేమాతరం ఆలపించకుండా కాశ్మీర్ ప్రజలు జైలులో ఉండాలని కాంగ్రెస్ భావిస్తోందా..? ఇది చట్టపరమైన బాధ్యత. కావాలనుకుంటే కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి రావాలి.ఆ తర్వాత వారు ఈ చట్టాన్ని రద్దు చేయొచ్చు.. అంటూ ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. తమ పార్టీ సిద్ధాంతాలకు, వందేమాతరం గేయానికి సంబంధం లేదన్నారు. ఇది చట్టం అని, అందువల్లే పాటిస్తున్నామన్నారు. కూటమిలో ఉన్నంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ తమపై ఒత్తిడి తేలేదని ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

## లారీని ఢీకొట్టిన వ్యాన్..

ఎనిమిది మంది అక్కడికక్కడే మరణించగా, చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. 9 మంది మృతుల్లో ఆరుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు.కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం సకోలి సబ్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. మరణించిన వారి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మరోవైపు హైవే సమీపంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. ప్రమాదానికి కొద్దిసేపటి ముందు బొలెరో వాహనం అతివేగంగా ప్రయాణించినట్లు ఫుటేజ్‌లో కనిపించింది. లారీని ఢీకొట్టే ముందు వ్యాన్ డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.




# భూ భారతి కాదు, భూ హారతి.. హరీశ్ రావు ఫైర్

త్రినెట్ న్యూస్, సెప్టెంబరు11

భూ భారతి కాదు.. అది భూ హారతి అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో భూ భారతి అక్రమాలపై ఆధారాలను బయటపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో రాధ అనే వృద్ధురాలికి చెందిన భూమిని భూ భారతి ద్వారా కబ్జా చేశారు. బాధితురాలికి తెలియకుండానే ఆమె భూమిని వేరే వారి పేరిట రిజిస్ట్రేషన్ చేశారని మండిపడ్డారు. కేవలం 10 రోజుల్లోనే ఆమె భూమిని ఆమెకు కాకుండా చేశారు. ధరణిని తీసేసి భూ భారతి తీసుకురావడానికి ముఖ్య కారణం ఇదేనని విమర్శించారు.అలాగే రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాముల గ్రామంలో అనుముల తిరుపతిరెడ్డి భూ కుంభకోణాన్ని బయటపెట్టారు. గతంలో అనుముల తిరుపతిరెడ్డికి వ్యతిరేకంగా రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన 5 నెలల్లోనే అనుముల తిరుపతిరెడ్డికి సానుకూలంగా భూమి డాక్యుమెంట్లు మార్చేశారని ఆరోపించారు. ఆ భూమిలో ప్రజలందరూ బిల్డింగ్‌లు కట్టుకుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అది వ్యవసాయ భూమి అని అనుముల తిరుపతిరెడ్డి పేరిట డాక్యుమెంట్లు సిద్ధం చేసిందన్నారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136